


దోలీలో బాలింత టిక్రైను కొండ దించుతున్న బంధువులు (ఫైల్)

నేడు డిప్యూటీ సీఎం పవన్ రాక



● ఒకేసారి 19 గిరిశిఖర రోడ్లకు శంకుస్థాపన ● మక్కువ మండలం బాగుజోలలో పర్యటన ● ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

పార్వతీపురం/సాలూరురూరల్/మక్కువ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి)

ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శుక్రవారం జిల్లాకు రానున్నారు. ఒకేసారి 19 గిరిశిఖర గ్రామాల రోడ్లకు గిరిజన సంక్షేమ, స్త్రీ శిశు సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి, కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్‌తో కలిసి శంకుస్థాపన చేయనున్నారు. మక్కువ మండలం బాగుజోలలో జరిగే ఆయన పర్యటన కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బాగుజోల వద్ద 19 రహదారులకు శంకుస్థాపన జరిగే ప్రాంతాన్ని గురువారం అడిషనల్ ఎస్పీ ఓ.దిలీప్‌కిరణ్, సీతంపేట ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ఏఎస్పీ అంకిత, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఐటీడీఏ ఈఈ ఏ.మునిరాజ్, డీపీవో కొండలరావు, డీఎల్‌పీవో నాగభూషణ్, మండల స్థాయి అధికారులు, మక్కువ మండల టీడీపీ అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్‌నాయుడు, తదితరులు పరిశీలించారు. ఏజెన్సీ ప్రాంతం దృష్ట్యా సాలూరు సీఐ రామకృష్ణ, ఎస్ఐ వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో పోలీసు, సీఆర్‌పీఎఫ్ బలగాలు పటిష్ట బందోబస్తును నిర్వహిస్తున్నాయి.

పవన్ పర్యటన ఇలా..

శుక్రవారం ఉదయం 9.30 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు డిప్యూటీ సీఎం పవన్ చేరుకుంటారు. విశాఖ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి 11.30 గంటలకు సాలూరు డిగ్రీ కాలేజి వద్ద ఏర్పాటు చేసిన బసకు చేరుకుంటారు. అక్కడ నుంచి మామిడిపల్లి, శంబర మీదుగా మధ్యాహ్నం 12.30 గంటలకు మక్కువ మండలం బాగుజోలకు చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ సందర్శిస్తారు. తరువాత 19 రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం 1.25 గంటల నుంచి 2 గంటల వరకు గ్రామస్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారు. 2.10గంటలకు అక్కడ నుంచి బయలుదేరి విశాఖపట్నం వెళ్లనున్నారు. ఆయనతో పాటు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, అధికారులు పాల్గొననున్నారు.

గిరిశిఖర రోడ్లకు మోక్షం..

జిల్లాలోని గిరి శిఖర గ్రామాల రోడ్లకు మోక్షం లభించింది. గిరిజనులకు డోలీ మోత కష్టాలను తప్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని 19 గిరి శిఖర గ్రామాల రోడ్లకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. మక్కువ మండలం బాగుజోల గ్రామం నుంచి సాలూరు మండలం సిరివర గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 9.50 కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే కొదమ గ్రామ పంచాయతీ పరిధిలోని బాగుజోల, చిలక మండంగి, బంద మండంగి, తాడిపత్రి, దైవర, సిరివర తదితర గ్రామాల్లోని గిరిజనులకు డోలీ మోత కష్టాలు తప్పనున్నాయి. అదే విధంగా పాచిపెంట మండలం ఆలూరి నుంచి వయా గుట్టూరు రిట్లపాడు వరకు బీటీ రోడ్డు కోసం రూ.4 కోట్లు, గుమ్మలక్ష్మీపురం మండలం పాముల గీసాడ బీటీ రోడ్డు నుంచి మంత్రజోల, చినగీసవాడ వరకు రహదారి నిర్మాణం కోసం రూ.3.60 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మూడు రహదారుల నిర్మాణం పూర్తయితే గిరిజనుల దశాబ్దాల కల నెరవేరినట్లు అవుతుంది.



అభివృద్ధి చెందనున్న సిరివర రోడ్డు



మక్కువ: శిలాఫలకాలు సిద్ధం చేస్తున్న దృశ్యం

సిరివర కథ..

సిరివరకు చెందిన కొండతామర టిక్రై అలియాస్ గిందే అనే గర్భిణికి నెలలు నిండకుండానే 2018 జూలై 27న నొప్పులు వచ్చాయి. అప్పటికప్పుడు ఏం చేయాలో తెలియని బంధువులు ఇంటి వద్దే ప్రసవం చేయించారు. మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే ఆ బిడ్డ చనిపోయాడు. ఆమెకు తీవ్ర రక్తస్రావం కావడంతో మూడు రోజుల తరువాత చికిత్స కోసం టిక్రైను బంధువుల సాయంతో భర్త డుంబ్రి డోలీలో కొండ దించి దుగ్గేరు వరకు తీసుకెళ్లాడు. అక్కడ నుంచి 108 వాహనంలో పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటన మీడియాలో వైరల్ అయ్యింది. అప్పటి ఐటీడీఏ పీవో లక్ష్మీషా గ్రామాన్ని సందర్శించి రోడ్డు మంజూరుకు అప్పటి టీడీపీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కొద్దిపాటి నిధులు రావడంతో రోడ్డు పనులకు చర్యలు చేపట్టారు. అయితే, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అప్పటి పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రహదారి నిర్మాణం జరగలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో సిరవర రోడ్డుకు మోక్షం లభించింది.

జిల్లాలో పరిస్థితి ఇది..

జిల్లాలోని పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో 2,324 గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఇందులో సీతంపేట ఐటీడీఏ పరిధిలోని 585 గ్రామాలకు రహదారి సౌకర్యం ఉండగా, 124 గ్రామాలకు రోడ్డు సదుపాయం లేదు. అలాగే, పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని 1200 గ్రామాలకు రహదారి సదుపాయం ఉండగా, 415 గ్రామాలకు ఆ సౌకర్యం లేదు. ఇప్పటికే ఉపాధి హామీ పథకంలో భాగంగా మెటీరియల్ కాంపోనెంట్ కింద కొన్ని గ్రామాలకు రహదారుల నిర్మాణం జరుగుతోంది. అయితే, పూర్తి స్థాయిలో బీటీ రహదారులుగా మారిస్తే గిరిజనులకు డోలీ మోత కష్టాలు తీరనున్నాయి.



మక్కువ: అధికారులతో మాట్లాడుతున్న సీతంపేట ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

జిల్లా అంతటా ముసురు

● ముందుకు సాగని వ్యవసాయ పనులు ● నిస్తేజంలో అన్నదాత



పాలకొండలో కురుస్తున్న చిరుజల్లులు

పాలకొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారింది. దీంతో జిల్లాలో గత రెండు రోజులుగా ముసురు వాతావరణం నెలకొంది. గురువారం అక్కడక్కడ మోస్తరు వర్షం కురిసింది. చేతికందిన పంట నూర్పులు చేపట్టి, ధాన్యం అమ్మకాలు చేపడదామన్న సమయంలో వరుణుడు కన్నెర్ర చేయడంతో రైతాంగం నిస్తేజంలో పడింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో వ్యవసాయ పనులు ముందుకు సాగడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం కళ్లాల్లోనూ, పంట పొలాల్లోనూ నూర్పులు చేపట్టి భద్రపరిచిన ధాన్యం తడిసిపోయి రంగుమారే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. తీతకు సిద్ధంగా ఉన్న పత్తి కూడా కుళ్లిపోయే ప్రమాదముందని వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో 2 లక్షల ఎకరాల్లో వరి పంటను సాగుచేశారు. పంటను దక్కించుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ధాన్యాన్ని కల్లాల్లో భద్రపరుస్తున్నారు. కొంతమంది తడిచేనునే కుప్పలుగా వేస్తున్నారు. మరికొంత మంది నూర్పులు చేసి ధాన్యం ఇంటికి తరలిస్తున్నారు. మరో రెండు రోజులు వర్షాలు కురిస్తే పంటలు కుళ్లిపోయే ప్రమాదముందని రైతులు పేర్కొంటున్నారు. ముసురు వాతావరణంతో వివిధ ప్రాంతాలకు పనులకు వెళ్లేవారు అవస్థలకు గురవుతున్నారు. ప్రధానంగా విద్యార్థులు కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే క్రమంలో ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు రోడ్లు చిత్తడిగా మారాయి.



పాలకొండలో ధాన్యంపై టార్పాలిన్ కప్పిన దృశ్యం



విజయరాంపురంలో ముసురుతో పత్తి పంటను ఏరని దృశ్యం

ఏనుగుల సమస్య పరిష్కారమయ్యేనా?

● వాటి దాడిలో ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు ● జిల్లాకు చేరుకోని 'కుంకీ'లు ● డిప్యూటీ సీఎంపైనే ఆశలు

పార్వతీపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దశాబ్ద కాలంగా జిల్లా ప్రజలను ఏనుగుల సమస్య వెంటాడుతోంది. ముఖ్యంగా కురుపాం, పాలకొండ నియోజకవర్గాల ప్రజలు, రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వాటి దాడిలో వివిధ గ్రామాలకు చెందిన 13 మంది మృత్యువాత పడ్డారు. 15 పశువులు మృతి చెందాయి. 3,305 ఎకరాల్లో పంట నష్టంవాటిల్లిం ది. ఫలితంగా 3,798 మంది రైతులు లక్షలాది రూపాయలు ఆర్థికంగా నష్టపోయారు. గజరాజుల తరలింపునకు గత వైసీపీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఇక్కడే తిష్టవేశాయి. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏనుగులను తరలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కర్ణాటక ముఖ్యమంత్రితో మాట్లాడి ఆ రాష్ట్రంలోని కుంకీ ఏనుగులను ఇక్కడకు పంపించాలని కోరారు. కుంకీలు ఈ ప్రాంతానికి వచ్చి ఏనుగులను అటవీ ప్రాంతానికి తరలిస్తాయని జిల్లా ప్రజలు ఆనందపడ్డారు. కానీ, ఇప్పటి వరకు కుంకీ ఏనుగులు జిల్లాకు చేరుకోలేదు. దీనికి సంబంధించి డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రత్యేక చర్యలు తీసుకుంటారని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు. అదే విధంగా జిల్లాలో ఇంటింటికి కుళాయి పథకానికి సంబంధించిన పనులు పడకేశాయి. నిధులు కొరతతో ఈ సమస్య ఏర్పడిందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు. ఈ సమస్యను కూడా పరిష్కరిస్తారని పవన్ కల్యాణ్‌పై జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.

గ్రానైట్ తవ్వకాలు ఆగేనా?

పార్వతీపురం మండలం కోరి రెవెన్యూ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న బడిదేవరకొండ వద్ద గ్రానైట్ తవ్వకాలు జరుగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంత ప్రజలు ఎంతో నమ్మకంతో దైవభక్తితో బడిదేవరమ్మను పూజి స్తారు. ఈ ప్రాంతంరిజర్వ్ ఫారెస్ట్‌లో ఉన్నా గత వైసీపీ ప్రభుత్వం గ్రానైట్ తవ్వకాలకు అనుమతులు ఇచ్చింది. దీనిపై ప్రజాసంఘాలు ఆందోళనలు చేశాయి. సీపీఎం, సీపీఐతో పాటు జనసేన పార్టీ నాయకులు ఉప ముఖ్య మంత్రికి గతంలో ఫిర్యాదు చేశారు. ఈ ప్రాంతం రిజర్వ్ ఫారె స్ట్‌లో ఉందని అటవీశాఖాధికారులు తేల్చి చెప్పినప్పటికీ కోర్టు తీర్పు అంటూ గ్రానైట్ తవ్వకాలు నిర్వహిస్తున్నారు. దీనిపై తమకు స్పష్టమైన హామీని ఉపముఖ్య మంత్రి ఇవ్వాల ని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



ఏజెన్సీలో సంచరిస్తున్న ఏనుగులు(ఫైల్)

చేపల ఉత్పత్తిదారులు

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

● కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చేపల ఉత్పత్తిదారులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ప్రధానమంత్రి మత్స్యసంపద యోజనలో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో చేపల రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటుపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మత్స్య సంపద మరింత అభివృద్ధి చెందాలన్నారు. దీనిద్వారా ఏడాదికి కేవలం రూ.194 కోట్లు మాత్రమే ఆదాయం చేకూరుతుందన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 96 వేల మంది ఆధారపడుతున్నారని అన్నారు. చేపల పెంపకంపై మత్స్యకారుల్లో ఉన్న అపోహలు, అనుమానాలు నివృత్తి చేయాలని జిల్లా మత్స్యశాఖ అధికారి వేముల తిరుపతయ్యకు సూచించారు. జిల్లాలోని పంచాయతీల్లో సుమారు 1,800 చెరువులు ఉన్నాయని, వాటిని చేపల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఏడాది నవంబరులోగా చేప పిల్లలను పంపిణీ చేయాలని కలెక్టర్ డీఎఫ్‌వోను ఆదేశించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన 2025 మార్చి 31కి పూర్తవుతుందన్నారు. సంఘం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం మొదటి విడతగా రూ.2.50 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. చేపల రవాణాకు బొలెరో వాహనాలు కావాలని ఉత్పత్తిదారులు కలెక్టర్‌ను కోరగా, పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. గ్రామ సచివాలయాల జాబితాలో సుమారు 2 లక్షల మంది మత్స్యకారులు ఉన్నట్టు సమాచారం ఉందని, కాని వేలిముద్ర వేయడానికి ఒక్కరూ అందుబాటులో ఉండడం లేదని, యాక్టివ్‌గా ఉండే సభ్యులే సంఘంలో ఉండాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, ఫిషరీస్ స్టేట్ కో-ఆర్డినేటర్ కె.గంగాధర్, డీఆర్‌డీఏ ఏపీఎం భారతి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

విద్యుత్ ప్రైవేటీకరణతో నష్టం

● పార్వతీపురంలో జేఏసీ నాయకుల నిరసన



విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

పార్వతీపురంటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌ను ప్రైవేటీకరిస్తే రైతులకు, ఆశాఖ ఉద్యోగులకు తీవ్ర నష్టం తప్పదని సంబంధిత జేఏసీ నాయకులు అన్నారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం సర్కిల్ కార్యాలయం వద్ద విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలోని విద్యుత్‌శాఖను ప్రైవేటీకరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. దీనివల్ల విద్యుత్ చార్జీలు పెరిగే అవకాశం ఉందని, రైతులు సబ్సిడీ కోల్పోతారని అన్నారు. దేశ ఆహార భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఉద్యోగుల భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుందన్నారు. యువతకు ఉపాధిలేక నిరుద్యోగ సమస్య తీవ్రతరం అవుతుందని అన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి పీసా కమిటీ ఎన్నికలు

సీతంపేట రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం నుంచి పీసా కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వం త్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 20 పీసా గ్రామసభల ద్వారా ఉపాధ్యక్షుడు, కార్యదర్శులను ఎన్నుకుంటారన్నారు. గ్రామ సర్పంచ్ అధ్యక్షతన, ఎన్నికల అధికారుల ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు తమ నామినేషన్‌ను ఉదయం 9.30 నుంచి 11గంటలోపు ఎన్నికల అధికారికి సమర్పించాలన్నారు. మొత్తం ఓటర్లలో 1/3 కోరం తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అలాగే కోరంలో 50 శాతం గిరిజనులు ఉండాలని పేర్కొన్నారు.

చిన్నగ్రామాలకు పెద్ద కష్టాలు

- రోడ్లు లేకపోవడంతో డోలీ మోతలు
- 20 కిలోమీటర్ల వరకు కాలినడక
- గిరిజనులకు తప్పని తిప్పలు
- నేడు మన్యం జిల్లాకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాక



దోలీతో వాగు దాటుతున్న గిరిజనులు (ఫైల్)




శృంగవరపుకోట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి)

శృంగవరపుకోట మండలం రేగ పుణ్యగిరి, దారపర్తి, పల్లపుదుంగాడ, రాయవానిపాలెం, గూనపాడు, చినగూనపాడు, కురిడి, పోర్లు, చప్పనగెడ్డ, చిట్టింపాడు చిన్న చిన్న గిరిజన పల్లెలు. ఒకదానికొకటి సంబంధం లేకుండా విసిరేసినట్టు నివాసాలు ఉంటాయి. ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి అక్కడ నుంచి ప్రధాన రహదారులకు రోడ్డు అనుసంధానం లేకపోవడంతో గిరిపుత్రులు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీకావు. అయితే డోలీ మోతల రహిత గిరిజన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వేస్తున్న అడుగులు వీరిలో ఆశలు రేపుతున్నాయి. మారుమూల గిరిజన గ్రామాల నుంచి సమీపంలోని ప్రధాన రహదారులను కలిపేలా తయారవుతున్న ప్రణాళికలు వారిలో నమ్మకాన్ని కలిగిస్తున్నాయి. గత సోమవారం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్, డైరెక్టర్ కృష్ణతేజ, సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులతో చర్చించిన విషయం తెలిసిందే. డోలీ మోతలు ఎక్కువగా ఉన్న పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మెదటి విడతలో 9 రోడ్లు నిర్మాణంతో 20 గ్రామాలకు డోలీ మోతలను తప్పించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మన్యం జిల్లాలో శుక్రవారం ఓ గిరిజన గ్రామం రోడ్డు అభివృద్ధికి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శంకుస్థాపన చేసేందుకు రానున్నారు.

ఈ రెండు జిల్లాల్లోని గిరిజన గ్రామాల మాదిరి జిల్లా పరిధిలోని శృంగవరపుకోట మండల పరిధిలోని పలు గిరిజన గ్రామాలు ఎదుర్కొంటున్నాయి. ఈ గ్రామాలకు సరైన రహదారి సదుపాయం లేకపోవడంతో అత్యవసర సమయంలో రోగులను డోలీల్లో తరలించాల్సి వస్తోంది. కొందరు మార్గమధ్యలో చనిపోయిన ఘటనలకూ కొదవలేదు. ఆసుపత్రి నుంచి మృతదేహాలను గ్రామాలకు తరలించాలన్నా డోలీ కట్టి తీసుకెళ్లాల్సిందే. ఈ గ్రామాలన్నీ అక్కడక్కడ విసిరేసినట్టు ఉంటాయి. ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లాలంటే రెండు నుంచి ఐదు కిలోమీటర్ల దూరం కొండపైన నడవాల్సి ఉంటోంది. పంచాయతీ కేంద్రానికి వెళ్లేందుకూ ఇదే పరిస్థితి. మూలబొడ్డవర పంచాయతీ శివారు చిట్టపాడు కొండ శిఖరాన ఉంది. ఈ గ్రామానికి రోడ్డు లేదు. పుణ్యగిరి ఆలయానికి వెనక భాగన రేగ పుణ్యగిరి గిరిజన గ్రామం ఉంది. కొండ శిఖరాన ఉన్న ఈ గ్రామానికి రోడ్డు లేదు. ఆసుపత్రికి రోగులను తరలించాలంటే 10 కిలోమీటర్ల దూరం డోలీతో దిగాల్సిందే. దాదాపుగా ఈ గ్రామాలన్నీ అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండల సరిహద్దుల్లో ఉన్నాయి. ఈ గ్రామాల నుంచి ప్రధాన రహదారులకు రోడ్ల అనుసంధానం లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రంలో అధికారం చేపట్టిన తెలుగుదేశం ప్రభుత్వం దారపర్తి పంచాయతీ శివారు పల్లపు దుంగాడ వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించింది. అటవీ శాఖ అనుమతులు వచ్చేలోపే ప్రభుత్వం మారింది. అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం దానిపై నిర్లక్ష్యం వహించడంతో పనులు ఆగిపోయాయి. ఈ రోడ్డు పూర్తయితే ఈ పంచాయతీ పరిధిలోని మిగిలిన గ్రామాలకు రోడ్లు అనుసంధానం చేసేందుకు అవకాశం ఉంటుంది. గత ఏడాది నవంబరు, డిసెంబరుల మధ్య, ఈ ఏడాది జనవరిలో మూలబొడ్డవర పంచాయతీ చిట్టంపాడు గ్రామానికి చెందిన ఓ బాలింత, ఇద్దరు చిన్నారులు సకాలంలో వైద్యం అందక మృతి చెందారు. ఈ సమయంలో ప్రస్తుత విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిలు కొండెక్కారు. వీరికి రోడ్డెంత ముఖ్యమే వారు గ్రహించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి పవన్‌కల్యాణ్ దృష్టిలో పెట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఈ గ్రామానికి 10.40 కి.మీ రోడ్డును నిర్మించేందుకు రూ. 1130 లక్షలను పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్ అక్టోబరులో కేటాయించారు. ఈ నిధులతో గునపాడు వయా మెట్టపాలెం, శనగపాడు చిట్టంపాలెం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. మైదాన ప్రాంత ప్రధాన రహదారికు ఈ రోడ్డు అనుసంధానం జరుగనుంది. కేంద్ర ప్రభుత్వ నిధులు ఆలస్యం అయ్యే అవకాశం ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వమే ఉపాధి నిధులతో పనులు చేపట్టనుంది.



ఎస్.కోట పంచాయతీ శివారు రేగ పుణ్యగిరి గ్రామం నుంచి డోలీ కట్టి దిగుతున్న గిరిజనులు



నిధులు రాబడుతున్నాం..

గిరిశిఖర గ్రామాల రోడ్ల నిర్మాణాలకు నిధులు రాబడుతున్నాను. ఇప్పటికే మూలబొడ్డవర పంచాయితీ శివారు చిట్టింపాడు గ్రామానికి రోడ్డు నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్య నిధులు వచ్చాయి. గిరిజన గ్రామాల ప్రజలకు డోలీ మోతలు లేకుండా చూడాలని శాసనసభలో ప్రస్తావించాను. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఈ రోడ్లకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు వినతిపత్రం అందించాను.

-కోళ్ల లలిత కుమారి, ఎమ్మెల్యే, ఎస్.కోట

నిస్సహాయులకు నిత్యాన్నదానం

- రోజూ 35 మందికి ఆసరా
- ఇళ్ల వద్దకు వెళ్లి అందిస్తున్న చీపురుపల్లి లయన్స్ క్లబ్ ప్రతినిధులు

చీపురుపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ అంటే రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, విభిన్న ప్రతిభావంతులకు పరికరాల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలే కాదు అన్నార్థులకు అన్నం కూడా పెడుతోంది. అది కూడా వారి ఇంటికి వెళ్లి అందజేస్తోంది. చీపురుపల్లి లయన్స్ క్లబ్ వినూత్నంగా నిస్సహాయులకు భోజనం అందజేస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. 2013 జనవరి 1న చీపురుపల్లి క్లబ్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తలదాచుకోడానికి గూడు ఉన్నప్పటికీ అనారోగ్యంతో మంచం పట్టినవారు, నా అనే వారి లేని వృద్ధులను గుర్తించి రోజూ అన్నం పెడుతోంది. ఏడుగురు అనాథలతో ప్రారంభమైన ఈ కార్యక్రమం ఇప్పుడు 35 మందికి చేరింది. దీనికోసం క్లబ్ ప్రతినిధులు, సేవాభావం కలిగిన మర్రి సీతమ్మకు భోజనాలను తయారు చేసే బాధ్యతను అప్పగించారు. అన్నం, రసం, కూరలు వండించి వాటిని క్యారియర్‌ల ద్వారా ఇళ్లకు అందజేస్తున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉంటున్న వారికి క్యారియర్ల ద్వారా భోజనం అందించేందుకు రేజేటి దిలీప్‌కుమార్‌ను నియమించారు. ఉదయం 11.30 సమయంలో మోటార్ బైక్‌పై బయల్దేరి అందరికీ భోజనాన్ని అందజేసే ఏర్పాటు చేశారు. అయితే, క్యారియర్ల ద్వారా భోజనం ఇవ్వడం వల్ల కొన్ని సమస్యలు తలెత్తడంతో భోజనం ప్యాకెట్ల ద్వారా పంపిణీ చేస్తున్నారు.

దాతల సహకారంతో..

గత 11 ఏళ్లుగా దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నడుపుతున్నారు. ప్రస్తుతం అప్పలనాయుడు (గరుగుబిల్లి, మెరకముడిదాం మండలం), ఎంవీకే నాగేశ్వరరావు, రామ్‌లీలా జువెలరీస్ యాజమాన్యం, హీరో హోండా షోరూం అధినేత వడ్డాది రవి కుమార్ తదితరులు పెద్ద మొత్తంలో సహకారం అందజేస్తుండగా, చాలా మంది దాతలు తమ ఇళ్లల్లో జరిగే ఫంక్షన్ల సందర్భంగా నిత్యాన్నదాన కార్యక్రమానికి విరాళాలు ఇస్తున్నారు. వాటితో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమానికి విరాళాలు అందజేయాలనుకున్న చీపురుపల్లి లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎస్.సన్యాసిరావు, ఎస్.రాధాకృష్ణ సంప్రదించవచ్చు.



నిస్సహాయులకు భోజనం అందజేస్తున్న దృశ్యం

'బాలాజీ'కి ఓవరాల్ ఛాంపియన్‌షిప్

- ముగిసిన పాలిటెక్నిక్ ప్రాంతీయ క్రీడాపోటీలు
- ద్వితీయ స్థానంలో ఎంఆర్‌ఏజీఆర్ కళాశాల



బాలాజీ పాలిటెక్నిక్ కళాశాల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జయరాం

విజయనగరం టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎంఆర్‌ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన 27వ అంతర్ పాలిటెక్నికల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ రీజనల్ మీట్‌లో గజపతినగరం మండలం మరుపల్లి బాలాజీ పాలిటెక్నిక్ కళాశాల ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించింది. ఈనెల 17 నుంచి నగరంలోని ఎంఆర్‌ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న ప్రాంతీయ క్రీడా పోటీలు గురువారంతో ముగిశాయి. స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఓవరాల్ ఛాంపియన్‌గా బాలాజీ పాలిటెక్నిక్ కళాశాల నిలవగా, ద్వితీయ స్థానంలో విజయనగరం ఎంఆర్‌ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నిలిచింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్జున అవార్డు గ్రహీత, బాక్సింగ్ క్రీడాకారుడు శీరం జయరాం హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.ఆశారమణి, ఇన్‌చార్జి పీడీ నాగకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంఆర్‌ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జయరాం, తదితరులు

తల్లడిల్లుతున్న రైతులు

- చిరుజల్లులతో వీడని ఆందోళన
- పొలాల్లోనే చేను, వరి కుప్పలు
- అక్కడక్కడా వరి కంకులకు మొలకలు
- ధాన్యం తరలింపునకు ఆపసోపాలు



లక్కవరపుకోట: మొలకెత్తిన పంటను చూపుతున్న ఈశ్వరరావు

రేగిడి/లక్కవరపుకోట/నెల్లిమర్ల/పూసపాటిరేగ/బొబ్బిలి రూరల్, డిసెంబరు 19, (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలు రైతుల ఉసురుతీస్తున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లెదుటే తడుస్తుండటంతో తల్లడిల్లుతున్నారు. పొలాల్లోనే చేను, వరి కుప్పలు ఉండటంతో దిగులు చెందుతున్నారు. రేగిడి మండలంలోని దేవుదళ, సంకిలి, బూరాడ, గోపంపేట, కొమిర, వన్నలి, ఖండ్యాం, వెంకటాపురం, లక్ష్మీపురం, అడవరం తదితర గ్రామాల్లో వరి కుప్పలు సంరక్షణకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రభుత్వం సరఫరా చేసే టార్పాలిన్ల కోసం పడిగాపులు కాస్తున్నారు. లక్కవరపుకోట మండలంలోని రంగారాయపురంలో కరెడ్ల ఈశ్వరరావుకు చెందిన వరిపంట నీటిలో ఉండటంతో వరి కంకులు మొలకెత్తాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి పనసలు తడిచి ముద్దవ్వడంతో వాటిని నెల్లిమర్ల మండలం గొర్లిపేట, కొత్తపేట రైతులు ఆరబెట్టే పనిలో నిమగ్నమయ్యారు. పూసపాటిరేగ మండలంలో కోతలు ఇంకా పూర్తవలేదు. కోసిన పంట సైతం పొలాల్లోనే ఉంది. దీంతో రైతులు ఆందోళన చెందతున్నారు. బొబ్బిలి రూరల్‌లోని పలు గ్రామాల్లో రైతులు తమ పంట ధాన్యాన్ని కాపాడుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని రవాణాకు వాహనాలు లేకపోవడంతో కొంతమంది రైతులు సొంతంగా వాహనాలను ఏర్పాటు చేసుకుని తమ ధాన్యాన్ని మిల్లులకు తరలించే పనిలో బిజీగా ఉన్నారు. మిగిలిన పంట రక్షణకు అష్టకష్టాలు పడుతున్నారు. వీరఘట్టం మండలంలో గురువారం చిరుజల్లులు వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందారు. పంట పొలాల వద్ద ఉన్న ధాన్యం బస్తాలను రైతులు నాటుబళ్లపై ఇళ్ల, రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు.



వీరఘట్టం: ధాన్యం బస్తాలను ఇళ్లకు తరలిస్తున్న రైతులు



నెల్లిమర్ల మండలం కొత్తపేటలో పొలంలోని వరి పనసలను గట్టుపై ఆరేస్తున్న రైతులు



బొబ్బిలి రూరల్: అలజంగిలో ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్న దృశ్యం

రూ.2.9 కోట్లు రికవరీ

- పారదర్శకత పెంచేందుకే సామాజిక తనిఖీలు
- పల్లె పండగలో 2203 పనులు
- గ్రామాల్లో విస్తృతంగా ఉపాధి పనులు
- డ్వామా పీడీ కళ్యాణచక్రవర్తి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



విజయనగరం రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ పనులు విస్తృతంగా పనులు చేపడుతున్నాం. ఏటా సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నాం. పనుల్లో అవినీతి, ఇతరత్రా తప్పులు జరిగితే సంబంధిత వ్యక్తుల నుంచి రికవరీ చేస్తున్నాం. ఇలా జిల్లాలో ఏటా ఒక పర్యాయం గ్రామ స్థాయిలో, మండల, జిల్లా స్థాయిలో సామాజిక తనిఖీలు నిర్వహించి పారదర్శకత పెంచుతున్నా మని డ్వామా పీడీ కళ్యాణ చక్రవర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం ఉపాధి, పల్లె పండుగ పనులు, నిధుల వెచ్చింపు, పనుల్లో పురోగతి తదిదర అంశాలపై 'ఆంధ్రజ్యోతి'తో ముఖాముఖి అయ్యారు.

- **ప్రశ్న:** జిల్లాలో సామాజిక తనిఖీ ద్వారా ఇంతవరకూ ఎంత రికవరీ చేశారు?
- **జవాబు:** ఏడాదికి ఒకసారి గ్రామస్థాయిలో సామాజిక తనిఖీ నిర్వహించి, నివేదిక సిద్ధం చేస్తారు. మండల, జిల్లా స్థాయిలో దీనిపై మరింత లోతుగా చర్చ జరుగుతుంది. అవినీతి జరిగినట్టు గుర్తిస్తే సంబంధిత వ్యక్తుల నుంచి రికవరీ చేస్తాం. ఇలా జిల్లాలో ఇంతవరకూ రూ.2.9 కోట్లను రికవరీ చేసేందుకు నిర్ణయించాం. డిసెంబరు 10 నాటికి రూ.42 లక్షలు మినహా మిగతా మొత్తాన్ని రికవరీ చేశాం. వచ్చే నెల తొలివారంలో మొత్తం రికవరీకి ప్లాన్ చేశాం.
- **ప్ర:** ఉపాధి పనులు పారదర్శకంగా జరగుతున్నాయా?
- **జ:** ఉపాధి పనుల్లో పారదర్శకత పెంచేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. ఇందుకు తగ్గ ఆదేశాలు కూడా ఇచ్చింది. ఉపాధి పనుల్లో పారదర్శకతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. క్షేత్రస్థాయిలో సిబ్బందికి కూడా తగిన ఆదేశాలు ఇచ్చాం.
- **ప్ర:** మస్తర్లు, పనుల అంచనాల్లో అవకతవకలు మీ దృష్టి ఏమైనా వచ్చాయా?
- **జ:** మస్తర్లు, పనుల అంచనాల్లో అవకతవకలపై ఊపేక్షించం. అలాంటివి ఉంటే సామాజిక తనిఖీల్లో బహిర్గతమవుతాయి. గ్రామసభల్లో ప్రజలు కూడా స్వచ్ఛందంగా చెబుతున్నారు. అటువంటి విషయాలపై విచారణ చేపట్టి.. ఆ మొత్తాన్ని రికవరీ చేస్తాం.
- **ప్ర:** జాబ్ కార్డులు అడిగిన అందరికీ ఇస్తున్నారా?
- **జ:** జిల్లాలో విస్తృతంగా ఉపాధి పనులు చేపడుతున్నాం. ఉపాధి పనుల కోసం అడిగే వారికి అవకాశాలు కల్పిస్తాం. జాబ్‌కార్డులు ఇస్తాం.
- **ప్ర:** పల్లె పండుగ పనుల పురోగతి ఎలా ఉంది. ఎంత మేర నిధులు కేటాయింపులు జరిగాయి?
- **జ:** పల్లె పండుగకు 2,203 పనులు గ్రామసభల ద్వారా వచ్చాయి. వీటికి రూ. 155 కోట్లు కేటాయించాం. ఈ పనులు వేగవంతానికి కలెక్టరు అంబేద్కర్ సమీక్షలు నిర్వహిస్తున్నారు. సంక్రాంతి నాటికి పనులు పూర్తి చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

తప్పు జరిగితే ఊపేక్షించం

- సమాచార బోర్డులు, రోజ్‌గార్ దివస్ తప్పనిసరిగా నిర్వహించాలి
- డ్వామా పీడీ కళ్యాణచక్రవర్తి

విజయనగరం రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పని చేయని వారికి మస్తర్లు వేయడం, పనుల కొలతల్లో తేడాలు ఉన్నట్టు కొన్ని గ్రామాల్లో జరిగినట్టు సామాజిక తనిఖీల్లో వెల్లడైందని, అటువంటి వాటి విషయంలో ఊపేక్షించమని డ్వామా పీడీ కళ్యాణ చక్రవర్తి అన్నారు. వారి నుంచి రికవరీ శతశాతం చేస్తామన్నారు. ఈమేరకు గురువారం విజయనగరం మండలానికి సంబంధించి ఉపాధి పనుల సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా చేపట్టిన ఉపాధి పనులు, ఆయా పనుల్లో చోటు చేసుకున్న లోపాలు తదితర వాటిని ఆయన సమీక్షించారు. సమాచార బోర్డులు, రోజ్‌గార్ దివస్ వంటి కార్యక్రమాలు నిర్వహించడం లేదని సామాజిక తనిఖీ వేదికల్లో వెల్లడైందన్నారు. చాలా గ్రామాల్లో ఉపాధి పనులకు సంబంధించి సమాచార బోర్డులు ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. ఇక నుంచి తప్పని సరిగా ఉపాధి పనులకు సంబంధించి సమాచార బోర్డులు పెట్టాలన్నారు. రోజ్‌గార్ దివస్ కార్యక్రమాలతో ఉపాధి కూలీలకు అవగాహన కలుగుతుందన్నారు. ఎక్కువ ప్రయోజనం కలిగే ఈ కార్యక్రమాన్ని నిర్వహించకపోవడం వల్ల పథకం లక్ష్యం దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ తిరుపతినాయుడు, ఏవో గంటా వెంకటరావు, ఏపీవో రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ప్రభుత్వానికి ధన్యవాదాలు

లక్కవరపుకోట డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరి పంటను విక్రయించే రైతుల ఖాతాల్లో 24 గంటల్లో నగదును జమ చేస్తున్న కూటమి ప్రభుత్వానికి రైతుల తరఫున స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ధన్యవాదాలు తెలిజేశారు. గురువారం ఎల్.కోటలో గల ఆమె నివాసం వద్ద రైతులతో మాట్లాడారు. సకాలంలో నగదు అందుతోందా, లేదా అని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలుగుల్లి శేఖర్, జీఎస్ నాయుడు, రైతు నేతలు పాల్గొన్నారు.

నేడు స్టేడియం ప్రారంభం

విజయనగరం టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగర శివారు బాబామెట్టలో ఉన్న విజ్జీ క్రీడా ప్రాంగణంలోని ఖేల్ ఇండియా- మల్టీపర్పస్ ఇండోర్ క్రీడా మైదానాన్ని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శుక్రవారం ప్రారంభించనున్నట్టు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురువారం తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు దీన్ని ప్రారంభిం చనున్నట్టు తెలిపారు.

రోడ్లకు నిధులు

గరివిడి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గరివిడి మండలానికి 5 తారురోడ్లు మంజూరయ్యాయి. మిలటరీ రామారావు తోట మీదుగా కోడూరుకు తారు రోడ్డు నిర్మాణానికి రూ.1.80 కోట్లు ఉపాధి నిధులు మంజూరయ్యాయి. దేవాడ నుంచి దుమ్మెదకు రూ.1.30 కోట్లు మంజూరయ్యాయి. ఎం.దుగ్గివలస నుంచి యాడికకు రూ.1.30కోట్లు, గొర్లెపేట నుంచి దొడ్లపేటకు రూ.65 లక్షలు, గర్భాం నుంచి జగన్నాథపురానికి రూ.45 లక్షల నిధులు మంజూర య్యాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గంట్యాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ త్రినాథ రావు ఒక ప్రకటనలో తెలిపారు. పెణసాం, చినమానపురం, గొడియాడ, కిర్తుబర్తి, బుడతనాపల్లి, మదనాపురం, చినమదుపాడ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

పూసపాటిరేగలో..

పూసపాటిరేగ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పైడిభీమవరం నుంచి కుమిలి విద్యుత్ ఉపకేంద్రానికి వచ్చే 33కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. కుమిలి ఉపకేంద్రం పరిధిలోగల కుమిలి, రెల్లివలస, కొండగుడ్డు, చల్లవానితోట, గొల్లపేట, కేజీయాతపేట, సేరిపాలం, ఎల్‌డీతోట, మల్యాం, బొర్రవానిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఇంధన పొదుపు పాటించాలి

నెల్లిమర్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపును పాటించాలని విద్యుత్ శాఖ డీఈఈ ఎం.భీమరాజు సూచించారు. నెల్లిమర్లలో మహిళలతో గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఇంధన పొదుపు ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈ పి చ్చయ్య పాల్గొన్నారు

రేపు దిశ కమిటీ సమావేశం

విజయనగరం టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై చర్చించేందుకు జిల్లా అభివృద్ధి, సమన్వయ కమిటీ (దిశ) సమావేశం ఈ నెల 21న నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో బి.వి. సత్యనారాయణ గురువారం తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం ఉదయం 11 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

24న స్థాయీ సంఘాలు...

జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు ఈ నెల 24న జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు సీఈవో గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

22న సింహగర్జన

వేపాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకిస్తూ ఈ నెల 22న విజయనగరం జిల్లా కేంద్రంలో మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సింహగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల నాయకుడు దేబారికి కిరణ్ పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు

కో ఎడ్యుకేషన్ కళాశాలగా మార్పు

జామి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన జామిలోని ఉన్నత పాఠశాలను కో ఎడ్యుకేషన్ కళాశాలగా మార్పు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు, జామి మండల పెద్దలు హర్షం వ్యక్తంచేశారు. గురువారం పెదబాబు మాట్లాడుతూ విద్యారంగంపై దృష్టి పెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టి పెట్టడంతో పాటు, నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే లలిత కుమారికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

అధికారుల దృష్టికి భూ సమస్యలు తీసుకెళ్లండి



విజయనగరం రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి



ఎస్.కోట రూరల్: సమస్యలు వింటున్న ఎమ్మెల్యే లలితకుమారి

విజయనగరం రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో 22ఏ భూములు యథేచ్ఛగా మార్చారన్న ఆరోపణలు ఉన్నాయని... అదేవిధంగా 1బీల్లో మార్పులు, చేర్పులు చోటుచేసుకున్నాయని...వీటిని రెవెన్యూ సదస్సుల్లో అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ప్రజలకు సూచించారు. మలిచెర్ల గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. తమ గ్రామ పరిధిలో ఉన్న భూ సమస్యలను స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం అదితి గజపతిరాజు మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం ఈ సదస్సులు ఎంతగానో ఉపయోగ ఎడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ దాట్ల కీర్తి, తహశీల్దారు కూర్మానాథరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వినియోగించుకోవాలి

శృంగవరపుకోట రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతాంగం వినియోగించుకోవాలని శాసన సభ్యురాలు కోళ్ల లలితకుమారి సూచించారు. గురువారం మండలంలోని కొత్తూరు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు అరుణకుమారి, ఆర్ఐ మనోజ్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్ నాయుడు, జనసేన నేత సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లిలో...

చీపురుపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ పరంగా ఉన్న సమస్యలను పరిష్కరించడానికే సదస్సులు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ గద్దె బాబూరావు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. సదస్సులో వచ్చిన దరఖాస్తులు పరిశీలించి, సంబంధిత అధికారులు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు మెయిన్ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు రౌతు కామునాయుడు, నాయకులు దన్నాన రామ చంద్రుడు, గవిడి నాగారాజు, మీసాల కాశీ, ఆరతి సాహు, వెంపడాపు లక్ష్మునాయుడు, జనసేన నాయకులు విసినిగిరి శ్రీనివాసరావు, కోట్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

భోగాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గత కొంత కాలంగా ఉన్న భూ సమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సుల ఉద్దేశమని మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు తెలిపారు. బసవపాలెంలో గురువారం రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. భూసమస్యలు పేరుకుపోయి ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. రైతులు సదస్సులను సద్వినియోగం చేసుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సురేష్, ఆర్ఐ ఇమ్రాన్, నాయకులు పాల్గొన్నారు.



భోగాపురం: వినతులు స్వీకరిస్తున్న కర్రోతు బంగార్రాజు

వైసీపీ నుంచి జనసేనలోకి..

భోగాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పూసపాటిరేగ మండలం రెల్లివలస పంచాయతీకి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం జనసేన పార్టీలో చేరారు. ముంజేరు జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి కండువాలు వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పనితీరు, నియోజకవర్గం అభివృద్ధికి చేస్తున్న కృషి చూసి అనేకమంది జనసేన పార్టీలో చేరుతున్నారని అన్నారు. పార్టీలోచేరిన వారిలో గొర్లె వెంకటరమణ, గొర్లె శ్రీనివాసరావు, మీసాల వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

చట్టాలపై అవగాహన అవసరం

డెంకాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది టీవీ వరలక్ష్మి అన్నారు. జాతీయ మహిళా కమిషన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'విధాన్‌సే సమాధాన్' మహిళా న్యాయ విజ్ఞాన సదస్సుని మండల పరిషత్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ, మహిళలు గృహ హింస చట్టం, మనోవర్తి, అత్యాచారాలకు సంబంధిత చట్టాలు, బాల్య వివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. మరో న్యాయవాది పద్మజ మాట్లాడుతూ ఏ సమస్య ఉన్నా జిల్లా న్యాయసేవాధికార సంస్థను గానీ లేదా టోల్ ఫ్రీ నెంబరు 15100 నెంబరుకు కాల్ చేసి తెలియజేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు పద్మావతి, వ్యవసాయశాఖ ఏడీ నాగభూషణం, కార్మికశాఖ ఏసీ ఎల్లాజీరావు, సంతోష్‌కుమార్, శ్రీజన్య, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులు తెలుసుకోవాలి

వేపాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాల బాలికలలకు హక్కులపై అవగాహన అవసరమని డీఎల్ఎంపీ స్వామి నాయుడు అన్నారు. నీలకంతరాజపురం, చినగుడిపాల గ్రామాల్లో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం లింగ వివక్షపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వామినాయుడు మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎంటీఎల్ వసంత, ఎమ్‌టీ సన్యాసమ్మ, యూనిట్ ఇన్‌చార్జి నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల రహదారి పరిశీలన

నెల్లిమర్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల, గొర్లెపేట ప్రాంతాల్లో విజయనగరం ఆర్డీఓ దాట్ల కీర్తి గురువారం పర్యటించారు. తొలుత నెల్లిమర్ల టిడ్కో ఇళ్ల సముదాయం రోడ్డును పరిశీలించారు. గొర్లెపేట వద్ద ఉన్న కొండలో నుంచి తారక రామ తీర్థ సాగర్ రిజర్వాయర్‌కు వచ్చే కాలువ తవ్వే ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. ఇందుకు సంబంధించి స్థానిక రెవెన్యూ, ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఇంజినీర్లతో పాటు హెచ్‌డీటీ రవిశంకర్, ఆర్ఐ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



కాలువ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ కీర్తి

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

కొత్తవలస, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి అందరూ కలసి పనిచేసుకోవాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటరామన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండో రోజు శిక్షణా తరగతులకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్. రమణయ్య, ఎంపీపీ గోపెమ్మ, జిల్లా ప్రతినిధులు పట్నాయక్, నాగరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఈఓ

మామిడి పంట బీమాను వినియోగించుకోవాలి

నెల్లిమర్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులు మామిడి పంట బీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల ఉద్యానవన శాఖ అధికారి డి.జ్యోత్స్నరాణి సూచించారు. కొండవెలగాడలో గురువారం జరిగిన సమావేశంలో రైతులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. బీమాకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు పెంచారని తెలిపారు. ఎకరానికి రూ.2000 వంతున చెల్లించాలని సూచించారు. ఈ సమావేశంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు జొన్నాడ వేణుబాబు, ఉద్యాన సహాయకురాలు వసంత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

31 వరకు గడువు..

లక్కవరపుకోట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మామిడి పంట వేసిన రైతులు తమ పంటకు బీమా చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం ఈ నెల 31 వరకు పెంచిందని వ్యవసాయాధికారి స్వాతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎకరాకు రూ.2వేలు ప్రీమియంగా నిర్ణయించినట్టు తెలిపారు. రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాలలో వ్యవసాయ సహాయకులను కలసి ప్రీమియం ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు.

మినప కోత మిషన్‌లో పడి యువకుడి మృతి

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం మినప కోత పనికి వెళ్లిన కూలీ కోత మిషన్‌లో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. తాడేపల్లిగూడెం మండలం కృష్ణాపురంలో గురువారం చోటుచేసుకుంది. రాజాంకు చెందిన విష్ణుపాత్రుని యల్లయ్య(37) మినప కోతలకు మిషన్ వద్ద పని చేసేందుకు వచ్చాడు. నీలాద్రిపురం శివారు కృష్ణాపురంలో మినప రొట్టను మిషన్‌లో వేస్తుండగా వేగంగా గాలి వేయడంతో బరకంతోపాటు క్రషర్‌లోకి దూసుకుపోయాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

సహకారం అందిస్తా

రాజాం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సేవా సంస్థల కార్యక్రమాలకు సహకారం అందిస్తానని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. గురువారం రాజాం రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ఛైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్ కుమార్, మానవత అధ్యక్షులు కుమార్, వికాస తరంగణి ప్రతినిధులు పైడిరాజు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పెంకి చైతన్య కుమార్. మానవతా కార్యదర్శి నీల కంఠేశ్వర యాదవ్ ఎస్పీని కలిశారు.

సామర్థ్యాలు పెంచాలి

రేగిడి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించాలని ఎంఈఓ వరప్రసాదరావు సూచించారు. చిన్నకోడిశ ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈఓ సందర్శించారు. పిల్లల విద్యాప్రమాణాలు, వర్కుబుక్‌ల నిర్వహణ, మధ్యాహ్న భోజనం అమలును ఆరా తీశారు.

పసుపుతో అలంకరణ

కొత్తవలస, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మార్గశిరమాస మూడో గురువారం సందర్భంగా కొత్తవలస పంచాయతీ కుమ్మరు బంజరులోనున్న ముత్యమాంబ అమ్మవారిని 10 వేల పసుపు కొమ్ములతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

క్షయను తరిమికొడదాం

రేగిడి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): క్షయ వాధిని తరిమికొడదామని రేగిడి పీహెచ్‌సి వైద్యాధికారి సోహ్నిరాఘవ్ పజలకు పిలుపునిచ్చారు. కందిశ గ్రామంలో టీబీపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

సిబ్బందిలో మార్పు రావాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

రాజాం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బందిలో ఎన్నిసార్లు హెచ్చరించినా మార్పు కనిపించలేదని... ఇకనైనా మారాలని ఎంపిడివో వి.శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం శ్యాంపురం సచివాలయాన్ని సందర్శించారు. ఆయన వెళ్లిన సమయానికి పూర్తి స్థాయిలో సిబ్బంది హాజరు కాక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్పు రాకపోతే చర్యలు తప్ప వని హెచ్చరించారు. అనంతరం కాలువ పనులను పరిశీలించారు.

పశుగ్రాసం సాగుకు సాయం

లక్కవరపుకోట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులు పశుగ్రాసం పెంచుకునేందుకు సాయాన్ని అందిస్తున్నట్టు ఏపీవో విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. పది నుంచి 50 సెంట్ల భూమి వరకూ పశుగ్రాసాన్ని వేసుకోవచ్చునని చెప్పారు.

క్రైం కార్నర్

గంజాయి కేసులో ముగ్గురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు

బొబ్బిలి/ తెర్లాం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి రూరల్ పోలీసు సర్కిల్ పరిధిలోని తెర్లాం మండలం డి.గదబవలస జంక్షన్‌లో గంజాయి తరలిస్తున్న రెండు కార్లను పట్టుకున్నామని డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన ఈ కేసు వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా నుంచి అక్రమంగా రెండు వాహనాల్లో గంజాయి వస్తున్నట్టు అందిన సమాచారంతో రూరల్ సీఐ నారాయణరావు, రామభద్రపురం, బాడంగి ఎస్ఐలు ప్రసాద్, తారకేశ్వరరావు, పీసీలు విష్ణు, పృథ్వీ తదితరులతో నిఘా పెట్టారు. రామభద్రపురం నుంచి రాజాం హైవేలో తనిఖీలు చేపట్టగా తెర్లాం డి.గదబవలస జంక్షన్‌లో గంజాయి తరస్తున్న రెండు కార్లను గుర్తించారు. మొదట ఆ కార్లలో ఎటువంటి గంజాయి లభ్యం కాలేదు. ఆ తర్వాత క్షుణ్ణంగా సోదా చేసి, కార్ల బానెట్‌లో గంజాయిని గుర్తించారు. ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లా పొందేల్ గ్రామానికి చెందిన చందన్ అడ్‌కటియా, హర్యానా రాష్ట్రం పాలవాల్ జిల్లా గోధి గ్రామానికి చెందిన వీరేంద్ర సింగ్, అదే రాష్ట్రం పరిదాబాద్‌కు చెందిన సునీల్ రాణాలను అరెస్టు చేశారు. ఈ ముగ్గురిని రిమాండ్ తరలించారు. వీరితో పాటు ఒక మైనర్ కూడా ఉన్నాడు. అలాగే ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లా ఘటిగూడ గ్రామానికి చెందిన కృష్ణపాంగి, సునీల్ అడ్‌కటియాతో పాటు హర్యానాకు చెందిన బన్వారీ అనే ముగ్గురు పరారయ్యారు. నిందితుల నుంచి 15 ప్యాకెట్లు (18.2 కిలోల గంజాయి), రెండు కార్లు, రూ.12 వేలు నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు విష్ణు, పృథ్వీలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించినట్టు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పి.కోనవలసలో...

పాచిపెంట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద బుధవారం సాయంత్రం నలుగురు వ్యక్తుల నుంచి 8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటసురేష్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. బుధవారం సాయంత్రం స్థానిక చెక్‌పోస్టు సమీపంలో నలుగురు వ్యక్తులు బ్యాగులతో అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. వీరిని స్థానిక పోలీసులు విచారించారు. బ్యాగులు తనిఖీ చేయగా సుమారు 8 కిలోల గంజాయి లభించింది. ఆ నలుగురు వ్యక్తులు తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. వీరు ఒడిశా రాష్ట్రం కొరాపుట్ నుంచి చెన్నైకు గంజాయి తరలిస్తున్నట్టు పోలీసులు తెలుసుకున్నారు. ఈ నలుగురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బొడ్డవర చెక్‌పోస్టు వద్ద..

శృంగవరపుకోట రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డవర చెక్‌పోస్టు వద్ద గురువారం మధ్యాహ్నం గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి విశాఖకు వెళుతున్న బోలెరో వాహనాన్ని చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేశారు. స్మగ్లర్లు తెలివిగా బయటకు గంజాయి కనిపించకుండా వాహనంలో ఒక ప్రత్యేక అర ఏర్పాటుచేసి తరలిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. దీంతో వాహనాన్ని పట్టుకున్నారు. అందులో సుమారు వంద కేజీలు గంజాయి ఉన్నట్లు తెలిసింది. ఈ విషయమై సీఐ నారాయణమూర్తి వివరణ కోరగా పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించాల్సి ఉందన్నారు. శుక్రవారం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

విజయనగరంలో..

విజయనగరం క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాంపై తనిఖీలు చేపట్టగా... అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న హరియాణా రాష్ట్రానికి చెందిన కుషన్ షీట్ అనే వ్యక్తి పట్టుబడినట్టు జీఆర్‌పీ ఎస్ఐ బాలాజీరావు తెలిపారు. రాయగడ నుంచి తిరుపతికి గంజాయి రవాణా చేస్తున్నట్టు తేలిందన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించినట్టు తెలిపారు.

పశువుల శాల దగ్ధం

భోగాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గుడివాడ గ్రామంలో బుధవారం రాత్రి బోర పెంటమ్మకు చెందిన పశువుల శాల దగ్ధమయింది. ఆవు, దూడ రెండింటినీ శాలలో కట్టి ఉంచారు. దీంతో ఆవు స్వల్పంగా గాయపడింది. ఇదే శాల గతంలో కూడా దగ్ధమైందని... అగ్ని ప్రమాదం ఎలా జరుగుతోందో తెలియడంలేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బస్సు డ్రైవర్‌పై ఆకతాయిల దాడి

వంగర, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజాం నుంచి కింజంగి గ్రామానికి వెళుతున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ వంజరాపు ఆనందరావును బుధవారం రాత్రి కొందరు ఆకతాయిలు గాయపరిచారంటూ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు బుధవారం రాత్రి రాజాం నుంచి బయలుదేరిన బస్సులో కింజంగికి చెందిన చింతాడ రవి, కళింగ చందులు విచక్షణా రహితంగా ప్రవర్తించడంతో పాటు కేకలు వేయడంతో బస్సు డ్రైవర్, కండక్టర్ వారించామని తెలిపారు. అరసాడ వద్ద ప్రయాణికులను దింపేందుకు బస్సును ఆపగా.. వారిద్దరూ డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డారని తెలిపారు. ముక్కుపై గాయం కావడంతో రాత్రి సమయంలో బస్సుతో రాజాం సామాజిక ఆస్పత్రికి చేరుకున్నామన్నారు. అనంతరం పోలీసులను ఆశ్రయించినట్లు డ్రైవర్ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ శంకర్ తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేద్దాం

శృంగవరపుకోట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు పార్టీ సంస్థాగత ఎన్నికల అధికారి పైడి వేణు గోపాలరావు అన్నారు. గురువారం స్థానికంగా ఉన్న ఫంక్షన్ హాల్‌లో కార్యకర్తలతో సమావేశమయ్యారు. పార్టీలో చేరికలకు అవకాశం కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు రెడ్డి పావని, రాజేష్ వర్మ, కొట్బాడ లోకాభిరామకోటి, డి.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాలరావు

ఉపాధి శిక్షణను వినియోగించుకోవాలి

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) విద్యార్థులు ఉపాధిని అందించే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఖాదీ ఇండస్ట్రీ కమిషన్ నోడల్ అధికారి డి.సుబ్రహ్మణ్యం సూచించారు. జీఎంఆర్ ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మోటార్ వైండింగ్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరైన సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నిరుద్యోగ యువత వీటితో ఉపాధి పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ సంస్థ మేనేజర్ నాగరాజు, సెంటర్ ఇన్‌ఛార్జి కనకం వెంకట రమణ, శిక్షణార్థులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వండి



చెరువు గట్టుపై ఆక్రమణలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బెలగాం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నెల్లి చెరువు ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని రైతు బజార్ సమీపంలో ఉన్న నెల్లి చెరువు ఆక్రమణలను ఆయన గురువారం పరిశీలించారు. పట్టణ నడిబొడ్డులో ఉన్న ఎంతో ఉపయోగకరమైన చెరువు ఆక్రమణ చేయడం సరైన పద్ధతి కాదని ఎమ్మెల్యే అన్నారు. అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారందరికీ నోటీసులు ఇవ్వాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా నెల్లి చెరువు గట్టుపై ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న పేద కుటుంబాలు ఎమ్మెల్యేకు తమ సమస్యలను తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

● జిల్లా రవాణా శాఖాధికారి దుర్గాప్రసాద్‌రెడ్డి

పార్వతీపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 88 పాఠశాలలు బస్సులు కలిగి ఉన్నాయని, వాహన డ్రైవర్లు మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవని జిల్లా రవాణా శాఖాధికారి టి.దుర్గాప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో ఉన్న స్కూల్ బస్సులకు ఇప్పటివరకు వాహన సామర్థ్య సర్టిఫికెట్స్ పునరుద్ధరించారని తెలిపారు. ఇందన శకట తనిఖీదారులు స్కూల్ బస్సులను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి, సంబంధిత ధ్రువపత్రాలు లేకపోయినా, మద్యం తాగి వాహనం నడిపినా చర్యలు తీసుకుంటారని విద్యా సంస్థల యాజమాన్యాలకు హెచ్చరించామని చెప్పారు. జిల్లాలోని స్కూల్, కళాశాల యాజమాన్యాలకు రవాణా శాఖ ఇందన శకట తనిఖీదారులు, సహాయ ఇందన శకట తనిఖీదారులతో రహదారి భద్రతా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



ఏవోకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పాలకొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భామిని మండలంలో పత్తి కొనుగోలు కేంద్రం తక్షణమే ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకుడు కిమిడి రామ్మూర్తినాయుడుతో కలిసి ఆర్డీవో కార్యాలయ ఏవోకు ఆయన గురువారం వినతిపత్రం అందించారు. భామిని మండలంలో సుమారు ఐదు వేల ఎకరాల్లో పత్తి పంట సాగు అవుతుందన్నారు. ఇప్పటికే రైతు చేతికి అందిన పంటను దాచుకోవడానికి సదుపాయాలు లేక ఇళ్లల్లోనే నిల్వ చేసుకుంటున్నారని చెప్పారు. దళారులు సిండికేట్‌గా మారి క్వింటా పత్తికి సుమారు రూ.1500 ప్రభుత్వం మద్దతు ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారన్నారు. తక్షణమే పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

ఇళ్ల మంజూరుకు ఆన్‌లైన్ చేసుకోండి

పాలకొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భామిని, పాలకొండ, పాలకొండ అర్బన్, వీరఘట్టం, జియ్యమ్మవలస, కురుపాం మండలాల్లో ఉన్న ఇళ్లు లేని పేదలు ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం2.0 కింద గృహాల కోసం సచివాలయాల్లో ఆన్‌లైన్ చేసుకోవాలని పాలకొండ డివిజన్ హౌసింగ్ అధికారి జి.రవి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుపు రేషన్‌కార్డు, కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డులు, బ్యాంకు లింకేజీ పాస్‌పుస్తకాలు, పొజిషన్ సర్టిఫికెట్లు, ఆదాయ ధ్రువీకరణపత్రం తదితర వివరాలతో సొంత స్థలం కలిగిన వారు సచివాలయంలో సంప్రదించి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

భవనాల పనులు వేగవంతం చేయాలి



ఇంజనీరింగ్ అధికారులకు సూచనలు చేస్తున్న ఏపీవో చిన్నబాబు

సీతంపేట రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలో చేపడుతున్న మల్టీపర్పస్ సెంటర్ల భవనాల పనులు వేగవంతం చేయాలని ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు అన్నారు. మండలంలో గౌరీపేటగూడ, బంజరుగూడ గ్రామాల్లో నిర్మిస్తున్న బహుళ ప్రయోజన కేంద్రాల నిర్మాణ పనులను ఆయన గురువారం పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. పనులు వేగవంతం చేసి నిర్దేశిత వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. అక్కడి నుంచి ఓంద్రుజోల గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను సందర్శించారు. మెనూ అమలు, పాఠశాల పరిసరాలు, ఆర్వో ప్లాంట్ పరిశీలించారు. విద్యార్థులకు సకాలంలో సిలబస్ పూర్తిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ పరిశీలనలో ఏపీవోతో పాటు ఇంజనీరింగ్ ఏఈ నాగభూషణం, హెచ్‌ఎం ఉన్నారు.

సామాజిక తనిఖీకి సహకరించాలి

భామిని, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ సామాజిక తనిఖీలకు ఉపాధి సిబ్బంది, ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఎంపీడీవో చంద్రరావు కోరారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఆయన ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలతో సమావేశం నిర్వహించారు. ప్రతి ఏడాది వలే ఈసారి 17వ సామాజిక తనిఖీలను ప్రత్యేక బృందం చేపడుతుందన్నారు. 2023-24 ఏడాదికి సంబంధించి ఉపాధి హామీ, పీఆర్, హౌసింగ్, హార్టికల్చర్, ఐటీడీఏల శాఖల ద్వారా రూ.19కోట్లు ఖర్చు అయ్యాయని తెలిపారు. ఖర్చులకు సంబంధించి మస్తర్లు వర్క్, ఆర్డర్, ఎంబుక్, ఫీల్డ్ అసిస్టెంట్లు అందించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీవో తులసీదాస్, ఎస్ఆర్‌పీ దాసుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

పార్వతీపురంటౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉన్న ఆక్రమణలను పోలీస్, మున్సిపల్ అధికారులు గురువారం తొలగింపజేశారు. అలాగే కాలువల్లో పూడికలు తీయించారు. ఇటీవల పలువురు కాలువల్లో పూడికలు తీయాలని, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ఆయా శాఖల ఉన్నతాధికారులకు వినతులు అందజేశారు. దీంతో నాలుగు రోడ్ల కూడలి వద్ద నుంచి మేదరవీధి కూడలి వరకు ప్రధాన రహదారిలో ఉన్న ఆక్రమణలతో పాటు కాలువల్లో పూడికలను ప్రొక్లయినర్‌తో తొలగింపజేశారు. ఇక నుంచి ఎవరైనా ఆక్రమణలను పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ మురళీధర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు హెచ్చరించారు.

చినుకు పడితే చెరువే..

● జలమయంగా మెంటాడ రోడ్డు ● వాహనదారుల ఇక్కట్లు



చెరువును తలపిస్తున్న మెంటాడ రోడ్డు

గజపతినగరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెంటాడ రోడ్డు చినుకు పడితే చెరువును తలపిస్తుంది. గురువారం కురిసిన వర్షానికి రోడ్డంతా జలమయమైపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. రోడ్డుకు ఇరువైపులా షాపుల నిర్మాణాలు చేపట్టిన యజమానులు, ఆక్రమణదారులు డ్రైనేజీపైకి రావడంతో మూసుకుపోయిందని, చిన్నపాటి వర్షానికే నీరు రోడ్డుపై ఉండిపోతోందని వాహనదారులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. గత ఐదేళ్లుగా ఇబ్బం దులు పడుతున్నా పురిటిపెంట పంచాయితీ పాలకులు, అధికారులు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందిం చి రోడ్డును బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● విప్ జగదీశ్వరి



పాఠశాల గదులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

కురుపాం, డిసెంబరు 19: ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించి, విద్యాభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. కురుపాం జడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.50.91లక్షల ఆర్ఎంఎస్ఏ నిధులతో నిర్మించిన అదనపు భవనాలను ఆమె గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం ఆమెను ఉపాధ్యాయులు, స్థానిక టీడీపీ నాయకులు సన్మానించారు. అలాగే రెండు నెలలో భవన నిర్మాణానికి కష్టపడిన మాజీ ఎంపీపీ జీవీ రమణమూర్తిని ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జె.ఉమా మహేశ్వరి, ఎస్ఎంసీ ఛైర్‌పర్సన్ ఎస్.సుధారాణి, తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, టీడీపీ మండల కన్వీనర్ కేవీ కొండయ్య, జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి కడ్రక మల్లేష్, హెచ్‌ఎం టి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్ద పీట

జియ్యమ్మవలస, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. పెదమేరంగి జంక్షన్ నుంచి చెరువు గట్టు మీదుగా వెంకటాపురం, బాసంగి గదబవలస గ్రామం వరకు 3.2 కిలో మీటర్లు బీటీ రోడ్డు వేసేందుకు ప్రభుత్వం రూ.2.60 కోట్లు మంజూరు చేసింది. ఈ రోడ్డుకు ఎమ్మెల్యే గురువారం శంకుస్థాపన చేశారు. ఆమె ఎంపీపీ బొంగు సురేష్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, కురుపాం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి కడ్రక మల్లేశ్వరరావు, వారణాశి శివ, కొండాబత్తుల కుమార్, రాగల అప్పలకొండ, దాసరి రామారావు, వెంపటాపు భారతి, తదితరులు పాల్గొన్నారు.

ఫిజికల్ టెస్టుకు ఉచిత శిక్షణ

జియ్యమ్మవలస, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారికి ఈనెల 30 నుంచి విజయనగరం పోలీస్ ట్రైనింగ్ కళాశాల వద్ద శరీర దారుఢ్య పరీక్షలు జరగనున్నాయని చినమేరంగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టీవీ తిరుపతిరావు తెలిపారు. గతంలో కానిస్టేబుల్ రాత పరీక్షలో ఎంపికైన వారు ఎవరైనా ఉంటే వారికి శరీర దారుఢ్య పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందిస్తామని ఆయన తెలిపారు. ఎవరైనా ఉంటే వెంటనే చినమేరంగి సర్కిల్ పోలీస్‌స్టేషన్‌కు నేరుగా వచ్చి సంప్రదించాలని ఆయన కోరారు. ఎట్టి పరిస్థితుల్లో దళారులను నమ్మి మోసపోవద్దని, డబ్బులు ఇచ్చి ఆర్థికంగా ఇబ్బంది పడొద్దని సూచించారు. ఎంపికలు పారదర్శకంగా ఉంటాయన్నారు.

సతీష్‌కు ప్రశంస



సతీష్‌కు ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాస్టర్ అథ్లెటిక్స్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన హోంగార్డు జి.సతీష్‌కు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మాధవరెడ్డి గురువారం ప్రత్యేకంగా అభినందించారు. కృష్ణా జిల్లా గుడివాడలో మాస్టర్ అథ్లెటిక్స్‌లో రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో బలిజిపేట పీఎస్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న సతీష్ పరుగు, లాంగ్ జంప్ విభాగంలో బంగారు, కాంస్యం పతకాలను సాధించారు. ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు. ఎస్పీతో పాటు బలిజిపేట ఎస్ఐ సింహాచలం, సిబ్బంది అభినందించారు.

కోటదుర్గమ్మను దర్శించిన ఎండోమెంట్ కమిషనర్



కోటదుర్గమ్మను దర్శించుకుంటున్న ఎండోమెంట్ కమిషనర్ దంపతులు

పాలకొండ, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోగల కోటదుర్గమ్మ అమ్మవారిని రాష్ట్ర ఎండోమెంట్ కమిషనర్, చీఫ్ సెక్రటరీ శ్రీరామ్ సత్యనారాయణ గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ అందించారు. కమిషనర్ వెంట ఏసీ సీపాన రాజారావు, సీనియర్ అసిస్టెంట్ రాజు ఉన్నారు.

నకిలీ మస్తర్లు వేస్తే కఠిన చర్యలు

రామభద్రపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనుల్లో నకిలీ మస్తర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆ పథకం ఏపీవో గొలగాని త్రినాథరావు హెచ్చరించారు. ఇట్లామామిడిపల్లిలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. దొంగ మస్తర్ వేస్తే సిబ్బందిని సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు.

బొబ్బిలిలో వసతి గృహం ఏర్పాటు చేయాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

బొబ్బిలి రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోమటిపల్లి గ్రామం లోగల బీసీ వసతి గృహాన్ని బొబ్బిలికి తీసుకురావాలని, సొంత భవనం నిర్మించాలని కోరుతూ ఏపీ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.సాయికిరణ్ ఆధ్వర్యంలో బొబ్బిలి లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈసందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ గత మూడేళ్లుగా బీసీ బాలుర కళాశాల వసతిగృహాన్ని కోమటిపల్లి నుంచి బొబ్బిలికి తీసుకు రావాలని ఎన్నో నిరసన కార్యక్రమాలు చేశామని చెప్పారు. వసతిగృహాన్ని రాబోయే విద్యా సంవత్సరం జూన్ నాటికి విద్యార్థులకు అందుబాటులో తీసుకురావాలని కోరారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి పట్టణ నాయకులు నందు చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సంతోషపురంలో గజరాజులు హల్‌చల్



సుంకిలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

గరుగుబిల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతోషపురం గ్రామంలో గురువారం గజరాజులు హల్‌చల్ చేశాయి. గత రెండు రోజుల కిందట నందివానివలసలోని తామర చెరువులో సంచరించిన ఏడు ఏనుగులు జియ్యమ్మవలస మండలం చినకుదమ, పెదకుదమ గ్రామాల వైపు తరలివెళ్లాయి. సంతోషపురంలో గెంబలి రవికి చెందిన ధాన్యం బస్తాలను ధ్వంసం చేశాయి. ధాన్యం నిల్వలతో పాటు అరటి, పామాయిల్ పంటలను ధ్వంసం చేసిన గజరాజుల గుంపు సుంకి ప్రాంతానికి చేరుకున్నాయి. ప్రధాన రహదారికి ఆనుకుని ఉండటంతో ఏ సమయంలో రహదారిపైకి వస్తాయోనన్న ఆందోళనలో ఉన్నారు. గతంలో పలు దపాలు గ్రామాల్లో సంచరించి పలు రకాల పంటలను ధ్వంసం చేశాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వరి పంట కోత కోసి పంట పొలాల్లోనే కుప్పలుగా వేశారు. ఒకవైపు తుఫాన్ ప్రభావం, మరోవైపు ఏనుగుల గుంపు సంచరించడంతో చేతికి అందిన పంట దూరమవుతుందన్న ఆవేదనలో రైతులు ఉన్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి ఏనుగుల గుంపును సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఏనుగులు సంచారం కారణంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని వీఆర్వో పి.రామకృష్ణ పంచాయతీ పరిధిలో దండోరా వేయించి అప్రమత్తం చేశారు.

వివాదాస్పద భూమి పరిశీలన

రామభద్రపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): తారాపురం రెవె న్యూ పరిధిలో ఉన్న షుగర్ ఫ్యాక్టరీకి సంబంధించిన వివాదాస్పద భూమిని బొబ్బిలి ఆర్డీవో రామ్మోహనరావు గురువారం పరిశీలించారు. తారాపురం గ్రామానికి చెందిన కొంతమంది రైతులు ఈ వివాదా స్పద భూమిపై కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. తారాపురం గ్రామానికి చెందిన నాగుల కొండ వారికి, అలాగే డీసీసీబీకి మధ్య ఈ భూ వివాదం కొన్నేళ్లుగా సాగుతోంది. దీనిపై ఇప్పటికే ఎంఆర్వో ఆకుల సులోచనారాణి విచారణ జరిపి, నివేదికను కలెక్టర్‌కు పం పించారు. అయితే ఆ నివేదిక సమగ్రంగా లేదని నాగుల కొండవారు ఫిర్యాదు చేయడంతో ఆర్డీవోను మళ్లీ విచారణ చేయాలని ఆదేశించారు. దీంతో ఆయన సంబంధిత స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ అక్యాన శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

జాతీయ బేస్‌బాల్ పోటీలకు బాడంగి విద్యార్థి

బాడంగి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పిండ్రంగివలసకు చెందిన రౌతు కిరణ్ జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల గుంటూరు జిల్లాలో జరిగిన స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి అండర్-19 బాలుర బేస్‌బాల్ పోటీల్లో కిరణ్ ప్రతిభ కనబరిచాడు. జనవరి 17 నుంచి 21 వరకు మహారాష్ట్రలో జరగనున్న జాతీయ స్థాయి పోటీ ల్లో పాల్గొనున్నాడు. ఈసందర్భంగా విద్యార్థితో పాటు పీడీ బంగారు నాయుడును హెచ్‌ఎం దత్తి సత్యనారాయణ, ఉపాధ్యాయ సిబ్బంది గురువారం అభినందించారు.

ఘనంగా విష్ణు సహస్ర నామార్చన



విష్ణు సహస్ర నామార్చన చేస్తున్న మహిళలు

సాలూరు రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా పెదకోమటిపేట రామాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విష్ణు సహస్ర నామార్చన చేశారు. ఈ పూజల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు కొత్త బస్సులు ప్రారంభం

పార్వతీపురం/టౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా కేంద్రం పార్వతీపురం ఆర్టీసీ డిపో నుంచి త్వరలో బయలు దేరే కొత్త బస్సులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాదురెడ్డి శుక్రవారం ప్రారంభించనున్నట్టు డిపో మేనేజర్ దుర్గా తెలిపారు. ఉదయం 10 గంటలకు డిపో వద్ద ప్రత్యేక పూజల అనంతరం బస్సులు ప్రారంభిస్తారని ఆమె చెప్పారు.

గోశాలలు పూర్తి చేయండి

సీతానగరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో గోశాలల పనులు పూర్తి చేయాలని ఎంపీడీవో పి.త్రివిక్రమరావు అన్నారు. ఆర్.వెంకంపేట గ్రామంలో జరుగుతున్న గోశాలల పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 23 గోశాలలు మంజూరయ్యాయని, పనులను పూర్తి చేయాలని రైతులకు తెలిజేస్తున్నామని, ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నారని తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

సీతానగరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తతో ఉండాలని ఏఎస్ఐ లంక శ్రీనివాసరావు అన్నారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా గురువారం చినబోగిలిలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మీకు తెలియని వ్యక్తుల నుంచి వెబ్ లింకులు పంపిస్తే ఓపెన్ చేయవద్దని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మండల సమావేశం మళ్లీ వాయిదా

సాలూరు రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సాలూరు మండల సమావేశం మళ్లీ వాయిదా పడింది. గురువారం సాలూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల సమావేశం నిర్వహించేందుకు ఎంపీడీవో ఎ.రమాదేవి సన్నద్ధమయ్యారు. అయితే అధికారులు ఎవరూ హాజరు కాకపోవడంతో వాయిదా వేయాల్సి వచ్చింది. బుధవారం కూడా కోరం లేక సమావేశం వాయిదా పడిన విషయం తెలిసిందే. వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, శివరాంపురం ఎంపీటీసీ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్లకు మోక్షం

సాలూరు రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ రానున్న నేపథ్యంలో సాలూరు దండిగాం రోడ్డులో గోతులకు మోక్షం లభించింది. డిప్యూటీ సీఎం మామిడిపల్లి మీదుగా మక్కువ మండలం బాగుజోలకు రోడ్డు మార్గంలో వెళ్లనున్నారు. దీంతో ఈ మార్గంలో గోతులను యుద్ధప్రాతిపదిక పూడ్చారు. అలాగే మామిడిపల్లిలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు.

అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసన

పాలకొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. పట్టణంలోని ఏలాం జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం మానవహారంగా ఏర్పడ్డారు. అంబేడ్కర్ పట్ల అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ భారత ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, దళిత యువసేన నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

బెలగాం, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): పరీక్ష పేపర్లు పోలీస్ స్టేషన్ నుంచి తరలిస్తుండగా మార్గ మధ్యంలో ప్రమాదం జరిగి మృతిచెందిన చిత్తూరు జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడి కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ డిమాండ్ చేశారు. ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు. పరీక్ష పేపర్లను నేరుగా విద్యాశాఖాధికారులే పంపించే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. గంట ముందు పేపర్లు ఇవ్వడం వల్ల ఉపాధ్యాయులపై ఒత్తిడి పెరుగుతుందని తెలిపారు. భవిష్యత్‌లోనైనా పేపర్లు నేరుగా పాఠశాలకు పంపించాలని కోరారు. మృతిచెందిన ఉపాధ్యాయ కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు.